వింత పోకడలు

వెంపటి

నాగభూషణం

మన్మథుడు మంచీ చెడ్డలు విచారించడానికి అవకాశం ఇవ్వకుండా—

మన్మథుడు బాణాలమీద బాణాలు కురిపిస్తూ ముందుకు దూకిస్తూ ఉన్న పదును పదను వయసులో మెరిసిపోతూన్న నాదముని—

భోజనం చేయగానే గోపాలపురం నుంచి అడ్డదోవను అంతదూరమూ నడిచివచ్చేవాడు—శ్రద్ధగా నాదగ్గర "కుసుమాంజలి" చదువుకునేందుకు!

స్వరాజోద్యమ ప్రారంభాన ఆవేశంతో ఆనర్సు పూర్తిచేయకుండా వదిలేసి మైసూరులో పరిభాషల దాకా వ్యాకరణం వల్లెవేసి అభ్యాస దీక్ష కాలు నిలువనీయ నందువల్ల మదరాసు తిరిగివచ్చేశాడు.

—లైబ్రరీలో ఆరంభమైన ఎరిక బీచ్ సావాసాన పరిచయంగా ముదిరింది. చూసినప్పటి నుంచీవాత్సల్య-ప్రణయం రెచ్చగొట్టే సౌమ్యవైఖరి ఆతన్ని నా అంతేవాసినిగా చేసింది.

ఉదయం నేను అడయారు వెళ్లి వచ్చేవాణ్ణి. మధ్యాహ్నామంతా నాదమునికి ఉదయన ప్రజ్ఞావివరణంతో ఖులాసాగా గడిచిపోయేది. ఎంతబలవంతం చేసినా విననందువల్ల నేనుకూడా, విధిలేక, కులపతి దర్జాతో ఆతని సరదా మన్నిస్తూపరిచర్యలు అందుకోవలసివచ్చేది. అంటే పాద సంవాహనాదికములు కావు! మన కామితములు కాఫీ - సిగరెట్టుగణములో నివేకదూ!

చూసేవారు—అంటే, మామూలుపరిచయంమాత్రం ఉన్నవారు—నాదముని శాస్త్రనిష్ణాతుడని కలలోనైనా తలచేందుకు వీలులేదు. ఆకారం, భాషణ, రంగేలీ కాలేజీ వాలాఎవడో అనిపించేది. మనతో జోస్తీకుదిరిన తరువాత కావ్య-నగిషీ మనసుకు అనుభవ-శృంగారంమెరుగురావడం ఎంతసేపు! ప్రత్యక్షప్రమాణాన్ని లక్షించే వారిలో అగ్రపూజ మనదే, అందువల్ల! కాని, ఇంతవరకూ ఆతను ఎక్కడా స్వతంత్రించలేదు. నేను చూస్తూ ఉండేవాడిని—త్రోవను వచ్చేటప్పుడు గుమ్మాలలోను, కిటికీల దగ్గరా వయ్యారాలు తేలిపోతూ కనిపించే ద్రావిడకన్యలు నాదముని సందుమలుపుతిరగగానే దగ్గరకు వచ్చేదాకా తనివిదీరా వాలుచూపులు విసిరి ప్రక్కకో, లోపలికో తప్పుకుని మళ్లా కనపడీకనపడకుండా మాయింటిగుమ్మం ఎక్కేదాకా మనసులో మాటలు చూపులతో వెంటరాయబారములు పంపేవాళ్లు! కాని, ఏమనుకునేవాడో బయటకి తొణకడు నావద్ద. ఆప్రస్తావనే తీసుకువచ్చేవాడుకాదు. నేను వేయికన్నులతో కనిపెట్టిచూసేవాడిని మావీధినిఉన్న ఏఅప్సరనోమైనా ఫలిస్తుందేమోనని! కాని ఉహుఁ.

ఎవరికైనా మాత్రం నిదానం ఎన్నాళ్లు?

ఇక మనసునిలుపలేక సాహసించి పిలిచారు. కబురులంపారు. త్రోవకాశారు. కాని ఏంప్రయోజనం? ఏఒకరసికురాలి మనోరథమూ ఈడేరలేదు. పైగా వాళ్ల ఎత్తులు కనిపెట్టి నాదముని దోవమార్చి తిరిగివచ్చేవాడు! అంతాగమనించి నేను కొంచెం హెచ్చరికగా ఒకటి రెండుసారులు కదిలించిచూశాను. 'ఏమిటోయ్-విశేషాలు-అని మాటలధోరణిలో పురికొల్పి హుషారిచ్చి హితము ఉపదేశించాను. నాశిష్యుడు అమాయిక ప్రవరభూమికను నిర్వహించడం నాకు తలవంపుగా ఉన్నది. తెలియనివాడా? కాగలపని గురుగంధర్వుడు చేయలేడని సాగరరాజు ఆపుణ్యము కట్టుకున్నాడు.

ఓనాడు మేము బీచ్ వొడ్డున తరగల ఒరవడికి బరాబరిగా కూర్చుండగా ఆఅందకత్తె మాముందునుంచి మమ్మల్ని లక్ష్యంచేయకుండా నడిచి వెళ్లింది. ఆమెవెంటను పసిపాప తప్పటడుగులకు ఊతయిస్తూ బహుశః వాళ్లతండ్రో, మామగారో ఓపండువంటిఆయన ఉన్నాడు.

చూడగానే నాదముని కొంచెం ఉలికిపడ్డాడు. ఉబికిపోయిన ఉత్సాహంతో ముఖం వెన్నెలచందమామలాగా కళలుతేలిపోయింది. లేవబోయినాడు. కాని, అంతలో కుదుటబడి కదలకుండా ఆమెపోయినవేపు చూస్తూ నాధ్యాస మరిచేపోయినాడు.

రేడియోపాట రాక్షసంగా ఉండటంచేత వెనుదిరిగి నేనూ ఈవాలకమంతా గమనించగలిగాను కార్యశూరునిగా చేదామని. సాక్షీగా చెపితే అపహాసించానని, నేను కనిపెట్టానని, బిడియపడతాడేమోనని ఏమీ తెలి

యనివాడిలాగా మామూలుగా వెళ్లి ఐస్‌క్రీమ్‌పట్టుకురమ్మని మేలుకొలిపాను. స్పెన్సరుబండి దూరాన గుంపుదగ్గర ఉన్నది. జనం చాటు అవడంమూలాన ఆ అమ్మాయి మాకు కనుచాటు అయింది. ఆ మాత్రం అందిచ్చినతరువాతకూడా ఇక, అల్లుకుపోకపోతే అంతటితో క్రాపూ, పోకులూ మానిపించి బ్రహ్మజిజ్ఞాసలోకి దింపవలసిందే!

కూర్చునేఉన్నాను. నాదముని తిరిగిరావడానికి ఎందుకో అంత ఆలస్యము చేస్తున్నాడు. ఎవరితోనన్నా బాతాఖానీ వేసుకున్నాడో ఏమన్నా చూస్తున్నాడో, ఏమైతేనేం, నా మాట మరచిపోయినాడు. ఇక లాభంలేదనుకొని ఎనిమిదికొట్టినతరువాత ఒంటరిగా యింటికి వెళ్లాను.

—వరాండలో కుర్చీనిఅంటిపడుకుని నిద్రపోతూన్న వాడిలాగా ఉన్నాడు —నాదముని. మెట్లమీద అడుగులచప్పుడు విని కలవరంపడుతూ లేవబోవడం కటకటాలగుండా కనపడ్డది, నాకు.

నేను ఎదురు అవగానే లేచి తల వంచుకొని నిలుచున్నాడు నవోఢలాగా. మెల్లగా ముఖం ఎత్తి కళ్లల్లోకి చూపుతో ప్రశ్నించాను. అర్థం చేసుకుని మరీసిగ్గుపడిపోయినాడు!

ఒకనిమిషం ఇద్దరమూ మాట్లాడకుండా నిలుచునేఉన్నాము. మనసు దిటవుపరచుకునేందుకు కొంచెం వ్యవధి యిద్దామని లోపలికి వెళ్లి, దుస్తులు తీసి, స్నానం చేసి లుంగీ, బనియనుతో తల దువ్వుకుంటూ బయటికి వచ్చి ఇంకా పూర్వపు పోజులోనే ఆతడు ఒదిగి కూర్చుని ఉండటం చూసి—

"సిగరెట్ భాయీ" అని, మూగనోము మానిపిద్దామని, పలుకరించాను. లేచి తీసుకువచ్చి ఇచ్చి అంగారసంస్కారం స్వయంగా చేసి పన్నె అందుకుని లోపల వేసి వచ్చాడు. పచారుచేస్తూన్నవాడి నల్లా నాదముని రావడం చూసి ఆగిపోయి దగ్గరగా వెళ్లి...

"ఎవరోయ్... ఆ అమ్మాయి!" అని ఏకధాటిని అడిగేశాను. తెల్లబోతాడని తెలుసును. కాని...అంతటితో వదిలేస్తానా? రెట్టించాను. తెలియదా ... ఇంతేనామరి—అని, మాటలతో గిలిగింతపెట్టాను.

ఇక తప్పనిసరి అయిపోయింది. ముందుకు రెండుఅడుగులు వేశాడు. ఇద్దరమూ వరాండాచివరకు జేరుకుని నిల్చుని ఉండగా ఆర్చిలో నుంచి వాళ్ల ఇల్లు చూపించాడు! మాలాండ్జికి వెనుక రోడ్డుమీదనే మాకు చాలాసమీపంలో—రెండు ఆవరణలూ కలిసే ఉన్నవనవచ్చును —ఆ అమ్మాయి ఉన్నది. ఉన్నదనుకోవడమేమిటి ఎదురుగుండా గదిలో వెలుతురున వాళ్లందరూ శుభ్రంగా కనబడుతూంటేను! ఆయన కూర్చుని పిల్లవాడితో చెలగాటా లాడుతున్నాడు- ఆ అమ్మాయి...ఫోనుదగ్గర నిలుచుని ఏ రికార్డు మొదలువేదామా అని ఆయనను సంప్రదిస్తూన్నట్టు తోచింది.

అక్కడే...నిలబడి పోయినాము. మొదట ఆ అమ్మాయి మా యింటి వేపు చూడలేదు. తరువాత చూసింది కాని గుర్తించలేదు. మరికొంతసేపటికి ఎవరో నిలుచుని తనవైపు చూస్తూన్నారని-గుర్తించినట్టున్నది. కాని, మేమేనని ఎరుగున్నదో లేదో పోల్చుకో లేదు. ఏమనుకున్నదో ఏమో తలుపు వేసుకుని మాకు కనపడకుండా మాత్రం పోలేదు.

—ఫోను రకరకాల పాటలు పలికింది. మధ్యమధ్య వాళ్లమాటలు నవ్వూ అస్పష్టంగా— ఎంతోదూరంలేక పోవడంవల్ల—చూచాయగా వినిపించినవి. వాళ్లు దీపం వేసేసుకునేటంతవరకూ ఆలాగా నిలుచుని ఉండిపోయినాము.

నాదముని రాత్రికి నావద్దనే ఉండిపోయినాడు. భోజనం చేయలేదు. కామగ్రీష్మంమహిమ! మరి ముఖమంతా కంది వాడి జేవురించిపోయింది! కనుమూయకుండా మసిలి తెల్లవారకముందే లేచి వెళ్లిపోయినాడు.

— ఆరోజునుంచీ పాఠాలకు ఆటవిడుపు. సాయంకాలము నాతో రోజూ బీచికి వచ్చేవాడు నలుమూలలా తిరిగేవాడు; తిరిగి యింటికి వచ్చి మామూలు స్థానాన వసారా చివర నిలబడి కిటికీలోకి చూసి చూసి మరునాడు పగలంతా మాయమయ్యేవాడు.

—నేను జోక్యంకలిగించుకుని ఫలరూపానికి తీసుకువద్దామనుకున్నాను. కాని, ముందుకు మంచిది, జీవితంలో ఈలాటి విషయాలలో స్వతంత్ర - అనుభవమే అక్కరకు వస్తుందికదా అని రసరూపకమునకు

ఏకైక ప్రేక్షకస్థానాన్ని మాత్రమే వాంఛించి ఊరుకున్నాను.

వాళ్లు ఇరువురూ దోవకువచ్చేస్తున్నారు. నిర్భయంగా ఒకరినొకరు చూసుకుంటున్నారు. నాదమునిచేసన్నలకు బదులు సైగలు లేకపోయినా, అభిమతం లేకపోయినా ఆ అమ్మాయి కంటగించుకోకుండా లక్ష్యము చేస్తూన్నది. కాని అంతకన్న ఏమీ అవకాశము ఇవ్వడం లేదు. మాశిష్యుడుకూడా చొరవ చేద్దామనే ఊహతో ఉన్నట్టు సూచనలు లేవు.

—చాలాతమాషాగా ఉన్నది. ఆ అమ్మాయివిషయము! వివరాలు తెలిసినమీదట తత్వం ఏమో బోధపడకుండా మరిన్ని ఆశ్చర్యముగా ఉన్నది. వారిద్దరూ దంపతులు. ఆపసిపాప సంసారఫలము. అంతఅందగత్తె యావనవిలాసశోభలు తరితీపులు చేస్తూన్న మోహిని ఆవయసుమళ్లిన అరసికమూర్తితో అమిత ప్రేమతో పొరపొచ్చెములు లేకుండా కాపురము చేస్తూన్నది. రతీమన్మథుల ఆనుకూల్యాన్ని మించిపోయింది వారి దాంపత్యమని ఇంటియజమాని రూఢిగా చెప్పాడు. అది నేను అంతగా నమ్మలేకపోయినా ఒకటి మాత్రం నిజం. ఇంతవరకూ అక్కడకు వాళ్లువచ్చిన మూడుసంవత్సరములలోనూ ఆమె పెడదారితీసిందని పుకారైనా లేదు.

—అయితే, యిటీవలిచర్యను బట్టి సుముఖురాలు కాదనడానికి ఏలాపీలు? ఒకవేళ ఏమీఎరుగని అమాయకురాలి నిష్కపటవర్తనము మావాడు, తనకుగా అన్వయించుకుని ఆశలూరుతున్నాడా?

లేక కనబడుతూన్నంత ముద్దరాలుకాకుండా జీవిత - ఇంద్రచాప కాంతులు తరళించిన చంద్రకాంతమా? ఎగతాళికి కికురించడమునకు ఆడుతూన్న కపటనాటకమా?

ఏమీ తేల్చుకోలేకుండా ఉన్నాను. అందమైనవయసుపిల్ల సామాన్యవర్తనలో ఇంత అర్థంకానితనము ఎన్నడూ నాకు తారసిల్లలేదు! పరోక్షాన రకరకాలుగా ఆ అమ్మాయినిగురించి ఆలోచనలు పోనిచ్చి సిద్ధాంతీకరించుకునేవాడిని. ఎంతకైనా తగినజాణ అని నమ్మేవాడిని. కాని, ఆలజ్జావతిని చూడగానే మళ్లా మనసులో రాద్ధాంతము ప్రారంభమయ్యేది.

నేనే ఒకనిర్ణయమునకు రానప్పుడు నాదమునికి ఏమనిసలహాయిచ్చి కాండ నడిపించగలను? ఏమీ పాలుపోవడం లేదు. కాని ఒకటిమాత్రం నికరం. ఆమెఆహ్వానించనిదేమావాడు చేయిచేసుకోవడంమాత్రము భావ్యముకాదు. చెడిపోనివాళ్లను, చెడిపోవాలని ఏమాత్రము ఉద్దేశ్యము లేనివాళ్లను, వంచించి వలలో వేసుకోవడం సుతరామూకలలోగూడా నాకు గిట్టదు.

—రోజూ బీచ్ దగ్గర తారసిల్లుతూనే ఉన్నాము. ఇతర వ్యాసంగాలూ, వినోదాలూ అన్నీ కట్టిపెట్టి నాదముని వెంటనే నేనూ అనుసరించడం అవసరమైనందువల్ల ఇంకొకచోటికి పోవడంలేదు. స్నేహితులను ఎవరినీ కలుసుకోవడం లేదు.

ఎప్పుడు సంజె పడుతుందా అని కాచుకుని ఉండటం యకాయకీని బీచ్ కి వెళ్లి ఆదంపతులను చూపుమేరలో ఉంచుకుని తిరగడం, చూసి చూసి యింటికి వచ్చి ఎప్పుడు తెల్లవారుతుందా ప్రొద్దు గుంకుతుందా ఎప్పుడు ఆమెసమీపంగా కనబడుతుందా అని ఉవ్విళ్లూరడం! ఈ వేదన అంతా నాకు లేదు కాని నాదముని మీదిమమకారాన 'మమ' అనుకోవలసివచ్చింది.

ఇద్దరు విలాసవంతులు తమను అనుసరించి తిరుగుతున్నారని వారు ఏనాడో గమనించారు. బీచ్ లో ఏమూలకు వెళ్లినా మేమే ప్రత్యక్షమౌతున్నాము, మరి. కాని, ఏమీ చలించలేదు. క్రమంగా ముసలాయనతో మాటలు కలుపుకుని పలుకరించడానికికూడా మొదలుపెట్టాము. ఆయన ఏమీ సంకోచించకుండా కులాసాగానే మాట్లాడుతున్నాడు. నేను సంభాషణలోకి దించి నిలవేసి ఆ పరాకులో నాదమునికి అవకాశం కలిగించాను అనేకసార్లు. ఆతడు ఆమెను నిర్భయంగా కోర్కెతో అర్థం చేసుకునేటట్టుగా చూడడం గమనించాను.

—పసివాడిని దగ్గరకు తీసికోవడం, ఏమన్నా కొనిపెట్టడందాకా వచ్చింది. ఒకటి రెండుసార్లు బీచ్ 'రెస్టరాంట్'లో కలిసి కాఫీ పుచ్చుకున్నాము. అప్పుడప్పుడు వాళ్లయింటికి వస్తూండమని—ఇరుగూపొరుగూ అని తెలిసిపోయిందిగనుక—పిలిచారు కూడాను. మాకుమాత్రం ఆఆహ్వానం అందుకునేందుకు ముఖం చెల్లిందికాదు. అప్పటికి ఆ అమ్మాయితో ఆయనఎదుటనే మాటలాడే జోస్తీమాత్రమే కుదిరింది.

ఆవేళ 'పేవ్ మెంట్' మీదనే ఆమె కనబడ్డది. పలుకరించడానికి

మాకు ఎప్పటికప్పుడు బెరుకుగానే ఉండేది; సందేహించాము. కాని, ఆమె నవ్వుతూ ఎదురుగా వచ్చి 'ఇంత ఆలస్యమైంది. ఇక మీరు రారేమోనని తిరిగివచ్చేస్తున్నాను. ఆయన కంచి వెళ్లారు. ఉదయంకాని రారు. చీకటిపడినతరువాత ఒంటరిగా వెళ్లవలసివస్తుందేమో నని' అన్నది. ఇంతకన్న ఏలాటిపరకీయ అయినా చేయి పట్టుకుని లాగుతుందా?

నాదముని నందనవనానికి ఎగిసిపోయినాడు. ఎగిరి గంతు వేసేవాడేమో కాని నేను చేయిపట్టుకుని ఆమెవెంట నడిచివెళ్లి ముగ్గురమూ ఒకచోట కూర్చున్నాము, కబుర్లు చెప్పుకుంటూ.

వెన్నెల విరియబూచింది. గాలి కెరటాలతో హాయిగా సరసాలాడుతున్న రేడియోపాట తెలియకుండానే ఆగిపోయింది. లేచి, తిరుగుముఖమై పసివాడికి పిప్పరమెంట్లు లంచమిచ్చి చంకను ఎక్కించుకున్నాను. 'మా...మా' అని పనసచదువుతూ క్రిందికి దిగాలని మెలికలుతిరుగుతూ అల్లరిచేస్తున్నాడు. నేను సంబాళించుతూ కొంచెం ముందుకు తొందరగా అడుగులు వేస్తున్నాను. వాళ్లిద్దరూ కొంచెం వెనుకఅయి మెల్లగా సాగివస్తున్నారు.

నాదముని కొంటెగా పిల్లవాడిని తనదగ్గరకు తీసుకుందామని చేతులు జాచే వ్యవధానంగా'మామ'అంటూ వాడు మీదికి వాలబోయినాడు. నేను వదలలేదు. ఆమె నవ్వుతూ "అందరూ మామలేనా?' అని ఆ పసికూనచెక్కిలి పుణికింది. ఇంకా సందేహ మేమున్నది. నాదముని తపస్సు ఫలించినదన్న మాటేకదూ?

మారోడ్డుకు వచ్చినతరువాత పిల్లవాడిని నావద్దనుంచి తీసుకుని వెళ్లివస్తానని నాతో మాటతోనూ, నాదమునికి చూపులతోనూ చెప్పింది' నేను వినిపించుకోకుండా వచ్చేసి వాయుపుత్రుడిఉత్సాహంతో క్రిందనుంచి మెట్లమీదుగా రెండుఅంగలలో పైకిఎగిరి తలుపుతీసుకుని కుర్చీలోపడి 'ఇన్నాళ్ళకు నాదముని... అమ్మయ్య' అంటూ సంతోషతరంగాలలో మునిగి తేలుతూండగా...

మెట్లమీద అడుగుల చప్పుడు...

నాదముని అయిఉండడు. వాళ్లిద్దరూ కలిసివెళ్లి పావుగంట అయిందేమో తిరిగివస్తాడా, రాగలడా? పక్కగదిలో ఉన్న కాలేజీకుర్రవాడేమో? పాలుతెచ్చే మునుస్వామి ఏమో? ఏమో?

—ఎవడూ కాదు! నాదముని తలుపు తోసుకుని వచ్చి అవతల గుమ్మంలో పోయి కూర్చున్నాడు. ఆతని వెంట ఆమె!

వచ్చింది! రావడమేమిటి అని ఆశ్చర్యపడటానికీ నివ్వెరపోవడానికీ అవకాశం ఏదీ? అమాంతంగా లేచి నిల్చుని కుర్చీలో కూర్చోమని చూపించాను. వద్దని తలత్రిప్పి, క్రింద చాపమీద ఆసీనురాలైంది. నేను ఆలాగే నిలువబడిపోయినాను.

సంకోచించలేదు తడబడలేదు! కథచెప్తూన్నట్లు మాట్లాడేసింది:

"ఇద్దరు అన్నలతో మాట్లాడడానికి నాకు చనువూ... స్వాతంత్ర్యం ఉన్నది కాదూ? అందుకనే ఇక్కడికి రావడానికి సందేహించలేదు. అలాఅయితే మీతో మొదలు మాటడేదాన్నే కాదు. ఆయనను పరిచయం చేసుకోనిచ్చేదాన్నే కాదు.

మీరు ఇర్వురూ నావంక చూడటం మొదలు పెట్టినప్పటినుంచీ నేను గమనిస్తూనే ఉన్నాను. నాకు ఏమీ కోపం రాలేదు.

"పరాయివాళ్లు వాంఛతో నన్ను చూడటం అంటే నాకు ఏమిటో తెలియక కాదు. అందమైనదానినని తెలుసును. కాని, ఈ జన్మకు నేను ప్రేమించేది ఆయన ఒకర్నే.

"వివరిస్తేనేకాని మీకు బోధపడదు. నేను అబద్ధమాడుతున్నానని మీరు అనుకోవచ్చు. కాని, మిమ్మల్ని మోసంచేయవలసిన అగత్యం ఏమున్నదీ?

"నేను ఎవరి ఆడపడుచునో ఏమిటో మొదలైన విషయాలు చెప్పనవసరంలేదు, అప్రస్తుతంగనుక. సంపన్నుల యింట్లో పుట్టాను. కవి-గాయక బాంధవ్యంవల్ల కళామాధుర్యారోచులు యౌవనోదయంతో విరిసినందువల్ల లోకవృత్తం తెలియని అమాయికపు ఆవేశంతో మాయమాటలునమ్మి మోసమోయినాను.

"ఎవరికీ తెలియకుండా ఆమాయగానివెంట (పేరుతలవను) వెళ్లిపోయి కలలాగా కొంతకైతవ ప్రణయంలో లోగిపోయినాను.

"నెలమసలింది! ఒంటరిదానను చేసి నన్ను వదలివేసి ఆతడు మాయమైనాడు. ఏంచేయగలను అర్భకురాలను?బంధువులు రానిస్తారా? ఎవరు తోడవుతారు?

"కాలవలో పడిపోదామని బయలుదేరి వెళ్లి పడిపోయినాను. స్పృహ తప్పి మునకవేశాను....

"అప్పుడు నాపాలిటిదైవం ఈ వృద్ధమూర్తి నన్ను ఉద్ధరించారు! బ్రతుకుదామని నాకు లేదు. కాని, బ్రతికించారు. నాదీనగాథ విని అభయమిచ్చి వెంట తీసుకువెళ్లి జనానా ఆస్పత్రిలో చేరిపించి రాజవైభవంగా ఉపచారములు జరిగేఏర్పాటు చేశారు. పసిపాపను తీసుకుని బాలెంతను, వారియింటికి వచ్చేశాను.

"పిల్లవాడిని ఆయనకు వప్పగించి జీవితం గంగకు అర్పించి పాపవిమోచనం చేసుకుందామని తలచాను; ప్రయత్నించాను. నాముక్తిదాత వదలలేదు. నన్ను వివాహం చేసుకున్నారు! ఎంతో దయతో ఎన్నోవిధముల నన్ను సంతోషపెట్టి వెనుకటి కష్టస్మృతులను మరిపిస్తున్నారు. పసిపాపను- కన్నవానికంటె ఎక్కువ లాలనతో ఆపేక్షతో చూస్తున్నారు. ఎంతఅదృష్టవంతులం? ఆయనకు ఎంత సేవచేసినా ఋణం తీరుతుందా మీరేచెప్పండి?

"పారబడినారని మీమీద నాకు లేశమున్నా ఆగ్రహం రాలేదు. నాచేతలకు మీరు అపార్థము కలిపించుకునేందుకు అమాయికంగా నేను దోహదం చేశానేమో?

"యౌవన సామాన్యమైన ఆవేశంతో నాదముని అన్నగారు అన్యథాగా నన్ను అనుసరించివచ్చి చొరవజేయబోయినారు. తెలియనిదోషం, మరేమీ పరవాలేదు. కాని బంధువులకు పరితపించేయీప్రాణికి ఆప్తులు దొరికినపుడు వారిదగ్గర దాపరికమెందుకూ? ..."

—చలనము లేకుండావిన్నాము. ఇద్దరమూ యథాస్థానాలచిత్రప్రతిమలమైపోయినాము! ఆమెమెల్లగాలేచి నాదమునివద్దకు వెళ్లి వాత్సల్యంతో మీద చెయివేసి "మీరు చిన్నబోయినారంటే నాకు ఏడుపు వస్తుంది. ఏదీ నవ్వండి! అన్నయ్యా!' అని, చక్కిలిగిలి చేసింది. ఆతడు వెక్కివెక్కి కళ్లుకడవలైబరిగిపోగా, సంబాళించుకుని నవ్వి ... నవ్వుతూఉండేటంతవరకూ వదిలిందికాదు ఆమె.

నన్ను సమీపించింది. అడుగడుగుకీ జఘన - వలగ్న - వక్షోభారరమ్య అయిన దేవీమూర్తిని నిర్మలంగా సాన్నిధ్యంచేసుకునే ఉపాసకుని విస్రమభావం నన్ను ఆవరించింది.

'వెళ్లివస్తాను' అన్నది.

అప్రయత్నంగా చేతులు ముకుళించాను. ఆమె రెండుచేతులతో ముకుళకరాంజలిని సమ్మానించి 'ధన్యురాలను' అని గమనోన్ముఖి అయి హంసమాలికలతో: "మీ బావగారు పిలిచినప్పుడు మీరు మొగమాటపడి భోజనానికి రాకపోయినారో మేనల్లుడిని పంపుతాను. బొమ్మలబండీఎక్కి బూరామేళంతో ఊరేగుతూ రాకతప్పదు సుమండీ!" అని, పిలుపు అందించి మెట్లుదిగి మాయమైపోయింది.

—మేము విశేషం పొద్దుపోకపోయినా ఒళ్లుతెలియని నిదురలో అలావాలిపోయినాము.